# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 23 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4




## రాష్ట్రపతి ముర్ముకు ఘనంగా వీడ్కోలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల రాష్ట్ర పర్యటన ముగిసింది. శనివారం ఆమె బేగంపేట్ విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి బయల్దేరి వెళ్లారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి ఘనంగా వీడ్కోలు పలికారు. పుట్టపర్తిలో రాష్ట్రపతికి ఏపీ సీఎం చంద్రబాబు స్వాగతం పలకనున్నారు.

### పంచాయతీ ఎన్నికలకు

# రిజర్వేషన్లు ఖరారు

- 50 శాతంలోపే రిజర్వేషన్లు
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఎంపీడీవోలకు వార్డు మెంబర్ స్థానాలు
- ఆర్డీవోలకు సర్పంచ్ స్థానాల ఖరారు బాధ్యతలు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రిజర్వేషన్లు ఖరారయ్యాయి. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదికకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలుపడంతో సర్పంచ్, వార్డు మెంబర్ల రిజర్వేషన్లకు విధివిధానాలను ఖరారు చేస్తూ శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జీవో నెం.46ను జారీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50 శాతం మించకుండా రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజకీయ పార్టీల సమక్షంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు రొటేషన్ పద్ధతిలో సీట్లను కేటాయిస్తారు. రెండ్రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తారు. రిజర్వేషన్ల కేటాయింపు తర్వాత పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. స్థానిక ఎన్నికలపై ఈ నెల 24న హైకోర్టులో కేసు విచారణ ఉంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ప్రారంభించినట్టు కోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేయనుంది. అలాగే విచారణ ముగించాలని కోరతారని సమాచారం. దీనిపై హైకోర్టు ఇచ్చే ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 25 లేదా 26న స్థానిక ఎన్నికల షెడ్యూలను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసే అవకాశం ఉంది.

బీసీ సర్పంచ్ స్థానాలకు 2024 కులగణన సర్వే ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తారు. ఎస్సీ, ఎస్టీ సర్పంచ్‌ల స్థానాలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ వార్డు మెంబర్ల రిజర్వేషన్లను 2024 కులగణన సర్వే ఆధారంగా నిర్ణయిస్తారు. గత ఎన్నికల్లో రిజర్వ్ చేసిన వార్డులు/గ్రామాలు అదే కేటగిరీకి మళ్లీ రిజర్వ్ చేయరాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాల్లో రిజర్వేషన్లను అమలు చేస్తారు. వంద శాతం ఎస్టీ గ్రామాల్లో అన్ని వార్డులు, సర్పంచ్ స్థానాలు ఎస్టీలకు మాత్రమే రిజర్వ్ చేయాలి. ఎస్టీ రిజర్వేషన్లను మొదట ఖరారు చేసి, ఆ తర్వాత ఎస్సీలు, ఆ తర్వాతే బీసీ కేటాయింపులు చేస్తారు. మహిళా రిజర్వేషన్లను అన్ని కేటగిరీల్లో జనాభా ప్రాతిపదికగా లెక్కించి ఖరారు చేయాలి. గ్రామ పంచాయతీ వార్డుల సంఖ్య తక్కువైతే, మొదట మహిళా ప్రాధాన్యత ఆ తర్వాత లాటరీ పద్ధతి పాటించాలి. 2019 ఎన్నికల్లో అమలు కాని రిజర్వేషన్లు యథాతథంగా కొనసాగిస్తూనే, కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్లు మొదటి సాధారణ ఎన్నికలుగా పరిగణిస్తారు. వార్డు రిజర్వేషన్ల నిర్ణయం ఎంపీడీవో, సర్పంచ్ రిజర్వేషన్ల ఖరారు ఆర్డీవోల ఆధ్వర్యంలో జరగాలి. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు రిజర్వేషన్ల ఖరారుకు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

### తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు

# ఘనంగా ఏర్పాట్లు

- ఫ్యూచర్ సిటీలో భారీ ఏర్పాట్లు
- దేశ, విదేశీ ప్రముఖులకు ఆహ్వానం
- విజన్ 2047 డాక్యుమెంట్‌కు తుది మెరుగులు
- 25 నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వరుస సమీక్షలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉన్నతాధికా రులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8, 9 తేదీల్లో ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తయిన సందర్భంగా గ్లోబల్ సమ్మిట్ పేరుతో విజయోత్సవాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీని ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు పూర్తయిన నేపథ్యంలో విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించేలా ఉండాలని చెప్పారు. డిసెంబర్ 8న చేపట్టే కార్యక్రమాలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పేలా ఉండాలన్నారు. డిసెంబరు 9న జరిగే కార్యక్రమంలో తెలంగాణ భవిష్యత్తు దార్శనికత, భవిష్యత్తు ప్రణాళికలు పొందుపరిచిన తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంటును ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్ లక్ష్యాలను కండ్లకు కట్టించే ఆడియో, వీడియో ప్రదర్శనలు, ప్రెజెంటేషన్లు తయారు చేసుకోవాలని సూచించారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదుపాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని చెప్పారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలనీ, అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటంలో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు గ్లోబల్ సమ్మిట్లో కీలక భాగస్వాములు కావాలని తెలిపారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవటం, రైజింగ్ డాక్యుమెంట్‌లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసుకోవాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు. ఈ ప్రణాళికపై ఈనెల 25 నుంచి తానే స్వయంగా వరుస సమీక్షలు నిర్వహిస్తానని తెలిపారు.

ఇప్పటికే ప్రజాభిప్రాయాలు, సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల్లోని నిపుణుల దూరదృష్టితో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047 రూపకల్పన జరిగిందని సీఎం తెలిపారు. వివిధ విభాగాల అధికారులతో నిర్వహించే సమీక్షల్లో వచ్చే విలువైన సలహాలు, నిర్దిష్టమైన సూచనలను పొందుపరిచి డాక్యుమెంట్‌కు తుదిరూపం ఇస్తామని ప్రకటించారు.

## దమ్ముంటే ఆధారాలను బయటపెట్టండి

- బీఆర్ఎస్ నేతలు చెబుతున్న రూ.5 లక్షల కోట్ల స్కాం ఆరోపణ పూర్తిగా నిరాధారం
- బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోలు19, 20, 21 వెనుక ఉన్న లక్షల కోట్ల మతలబు ఏంటి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఆరోపణలు చేయడం, అబద్ధాలు ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ నాయకులు కే తారకరామారావు, టీ హరీశ్‌రావుకు వెన్నతో పెట్టిన విద్య అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శనివారంనాడొక పత్రికాప్రకటన విడుదల చేశారు. విశ్వసనీ యత లేని బీఆర్ఎస్ నేతలు పదేపదే ప్రస్తావిస్తున్న రూ.5 లక్షల కోట్ల స్కాం ఆరోపణ పూర్తిగా నిరాధారం, అవాస్తవమని స్పష్టం చేశారు. దమ్ముంటే ఆధారాలను బయటపెట్టి మాట్లాడాలనీ, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 2023 ఆగస్టులో అప్పటి

బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోలు19, 20, 21 వెనుక ఉన్న లక్షల కోట్ల మతలబు ఏంటని ప్రశ్నించారు. వారిచ్చిన జీవోల ప్రకారం రెగ్యులరైజ్ అయిన భూముల్లో జోన్ మార్పిడికి సంబంధించి విధించిన 50, 30 శాతం చార్జీలతో రాష్ట్ర ఖజానాకు రూ. 4వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు తాము ప్రయత్నిస్తు న్నామన్నారు. కుంభకోణాలు అలవాటైన బీఆర్ఎస్ నేతలకు అందరూ వారిలాగే ఉంటారని భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు ప్రభుత్వ లీజ్ ల్యాండ్స్‌కు ఫ్రీహోల్డ్ రైట్స్ ఇచ్చి, 100 - 200 శాతం ఛార్జీలు విధించి మీరు వసూలు చేద్దామనుకున్న రూ.లక్షల కోట్ల సంగతేంటని నిలదీశారు. ప్రభుత్వంతో సంబంధం లేని సీఎం రేవంత్‌రెడ్డి సోదరులపై ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు నమ్ముతారనే భ్రమ నుంచి బయటకు రావాలని హితవు పలికారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా యువతకు ఉద్యోగాలు దక్కకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో సమాధా నం చెప్పాలని నిలదీశారు. వాస్తవాలను దాచిపెట్టి తమ ప్రభుత్వం 9,292 ఎకరాలు అమ్మకానికి పెట్టిందంటూ చేస్తూ ప్రజల్ని తప్పుతోవ పట్టిస్తున్నారన్నారు. ఈ భూముల్లో పరిశ్రమ లకు ప్లాటింగ్ చేసిన ఏరియా లేదా ఫ్రీ హోల్డ్ ప్రాపర్టీస్ కేవలం 4,740 ఎకరాలేనని, ఇవి పూర్తిగా ప్రయివేట్ వ్యక్తులకు చెందిన భూములేనని స్పష్టంచేశారు. మిగిలిన భూములు రోడ్లు, డ్రైనేజీ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు నిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.



## రాష్ట్ర డీజీపీ ఎదుట 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు శనివారం లొంగిపోయారు. ఇందులో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు ఉండగా.. మిగతా 34 మంది వివిధ క్యాడర్‌కు చెందినవారున్నారు. ఇందులో పెద్ద సంఖ్యలోనే మహిళలు ఉన్నారు. డీజీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో లొంగిపోయి న మావోయిస్టులను పోలీసు అధికారులు హాజరుపర్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మావోయి స్టుల సిద్ధాంతానికి మనుగడ లేదనీ, మారుతున్న కాలానికి అనుగుణంగా వారిలో మార్పు వచ్చి జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన పిలుపుమేరకే 37 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారని చెప్పారు. ప్రస్తుతం లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులున్నారనీ, వారిలో కొయ్యడ సాంబయ్య ఎలియాస్ ఆజాద్, అప్పాసీ నారాయణ ఎలియాస్ రమేశ్, నూపో గంగ ఎలియాస్ నీలేశ్‌లు ఉన్నారనీ, మిగతావారిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వివిధ కమిటీ సభ్యులు ఉన్నారని ఆయన వివరించారు. వీరి వద్ద ఒక ఏకే-47, రెండు ఎస్ఎల్ఆర్‌లు, నాలుగు పాయింట్ 303 రైఫిల్స్‌తో కలిపి మొత్తం ఎనిమిది ఆయుధాలున్నాయని తెలిపారు.

మిగితా 4వ పేజీలో

## తాటి, ఈత మొక్కల పెంపకానికి ముందుకు రావాలి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 45 లక్షల తాటి, ఈత మొక్కలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని, వాటి పెంపకానికి కల్లుగీత సంఘాలు ముందుకు రావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర సదస్సులో మంత్రి మాట్లాడారు. మొక్కలు నాటేందుకు, వాటిని పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సాయం చేస్తుందని తెలిపారు. గీత పనివారల సంఘం వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం అంటే తనకెంతో గౌరవమని, ప్రభుత్వంతో చర్చించి మర్రిగూడ మండలం చర్లగూడెం రిజర్వాయర్‌కు ధర్మభిక్షం పేరు పెట్టే విధంగా కృషి చేస్తానన్నారు. గీత కార్మికులు కులవృత్తి రక్షణతోపాటు వారి పిల్లల విద్యాభ్యాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు నెగ్గేందుకు విద్య చాలా అవసరమని, వారిని చదివించాలన్నారు. రాష్ట్ర మంత్రిగా తనవంతు బాధ్యతగా గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, కాటమయ్య రక్ష, సంఘపరమైన భవనాలకు సంబంధించి అన్ని గౌడ కుల పెద్దలతో కలిసి అమలయ్యే విధంగా చేద్దామన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, తాను కలిసి సీఎంతో మాట్లాడి ట్యాంక్‌బండ్ వద్ద సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటును త్వరలో చేపట్టనున్నట్లు చెప్పారు. ఏ విషయంలోనూ నిరాశ చెందొద్దని, ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కల్లు గీత వృత్తి ప్రధానమైందని, కొన్ని ప్రాంతాల్లో గౌడ కులస్థులే కాకుండా ఇతర కులాల వారూ కల్లు గీత వృత్తి చేస్తుండేవారన్నారు. బొమ్మగాని ధర్మభిక్షం పార్టీలు, కులాలకు అతీతంగా గీత పనివారల సంఘం స్థాపించి, గీత వృత్తి రక్షణకు పాటుపడ్డారని కొనియాడారు. గీత వృత్తి గ్రామీణ పరిశ్రమగా అభివృద్ధి చెందాలని సంఘం అనేక మార్గాలను ప్రభుత్వాలకు సూచించిందన్నారు. సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరును పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆలోచనలో మార్పు వచ్చిందని, కాలం మారిందని, కమ్యూనిస్టులు మరింత బలోపేతం కావాలంటే మరింత ఐక్యత అవసరమన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్, సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షులు కేవీఎల్, దూసరి శ్రీరాములు, పండ్ల రాములు, కార్యదర్శులు పబ్బూరి దేవేందర్ గౌడ్, బొమ్మగాని శ్రీనివాస్, గౌడ్ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ చరిత్రలో అందెశ్రీది మొదటి స్థానం




- ఆయన పేరిట స్మృతివనం నిర్మిస్తున్నాం
- న్యాయ, సాంకేతికపరమైన ఇబ్బందుల్లేకుండా ఎస్సీ వర్గీకరణ అమలు
- అందెశ్రీ సంతాపసభలో సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వజ్రాల గురించి దశాబ్దాలు, శతాబ్దాలు చర్చించినా కోహినూర్ వజ్రానికి పోటీ లేనట్టే.. కవులు, కళాకారులు ఎంత మంది ఉన్నా, ఎవరి గురించి చర్చించినా రేపటి తెలంగాణ చరిత్రలో అందెశ్రీ మొదటి స్థానంలో నిలబడుతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్నారు. అందెశ్రీ కీర్తిని తెలంగాణ చరిత్రలో శాశ్వతం చేయడంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడమే కాకుండా ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన అందెశ్రీ గారి సంతాప సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు.

జీవితంలో బడి ముఖమే చూడని సహజకవి అందెశ్రీ గారు రాసిన జయ జయహే తెలంగాణ.. గీతం ఈరోజు ప్రతి బడిలో పాడుకునేంతగా యావత్ తెలంగాణ సమాజాన్ని ప్రభావితం చేసిన గొప్ప కవి అని కొనియాడారు."బడికి వెళ్లని, బడి ముఖమే చూడని అందెశ్రీ అన్న జయ జయహే తెలంగాణ.. అంటూ ముక్కోటి గొంతుకలను ఏకం చేసి ఈ తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపితేనే రాష్ట్ర కల నిజమైంది. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలే కాదు. ప్రపంచంలోని ప్రతి మూలన ఉన్న గుండెకు జయ జయహే తెలంగాణ.. చేర్చి ఒక ఉద్యమ స్ఫూర్తిని నింపిన గొప్ప తెలంగాణ బిడ్డ అందెశ్రీ.నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు పాడుకున్నది. కోరుకున్నదే.. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా చదువు చెప్పే ప్రతి పుస్తకంలో రాయాలని ప్రజా ప్రభుత్వం ఆ గీతాన్ని పాఠ్య పుస్తకాల్లో మొదటి అంశంగా చేర్చాం. బాధతో ఉద్వేగంతో ఈ మాట చెబుతున్నా. ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన జయ జయహే తెలంగాణ... స్వరాష్ట్రం సాకారమైన తర్వాత ఆ గీతం రాష్ట్రీయ గీతంగా అధికారిక హోదా లభిస్తుందని 4 కోట్ల ప్రజలు ఆశించారు.

తెలంగాణ ఉద్యమం ఎవరు చేశారంటే అందెశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న, ఒక జయరాజ్ చేశారన్న చర్చ వస్తుందని గత పాలకుల హయాంలో ఆ గీతం మూగబోయింది. పెన్నే కదా అని మన్నుకప్పితే గన్నులై మొలకెత్తుతాయి.. గన్నులై గడీలే కుప్పకూలుతయన్న నినాదాన్ని అందెశ్రీ గారు నిజం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్రకు సంబంధించిన సమైక్య వాదులు ఈ తెలంగాణపై ఆధిపత్యం చెలాయిస్తున్నప్పుడు గద్దరన్న, గూడ అంజన్న, అందెశ్రీ, గోరటి వెంకన్న.. వారి ఆధిపత్యానికి చెరమగీతం పాడాల్సిందేనని, తెలంగాణకు విముక్తి కల్పించాల్సిందేనని మలి దశ ఉద్యమానికి పునాదులు వేశారు. రాచరికం హద్దు దాటినప్పుడు, తెలంగాణ నేలను చెరబట్టాలని, ఈ నేలపై ఆధిపత్యం చెలాయించాలని అనుకున్నప్పుడల్లా ఈ గడ్డపై పుట్టిన కవులు, కళాకారులు, తమ దుప్పటి దుమ్ము దులిపి దిగంతాలకు తరిమిన చరిత్ర ఈ నేలకు ఉంది. సర్వం త్యాగం చేసి ఏమీ ఆశించకుండా, ఆలోచించకుండా 5 దశాబ్దాల పని చేసిన ఆ కుటుంబాన్ని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. గద్దర్, అందెశ్రీ, ఈ ప్రజా పాలన కోసం శాయశక్తులా పనిచేశారు. వారి పోరాట స్ఫూర్తిని మేము ఎవరూ మరిచిపోలేనిది.

అందెశ్రీ కుటుంబంలో ఉద్యోగం ఇవ్వడంతో పాటు స్మృతివనం కట్టాలనుకున్నాం. అందెశ్రీ గారి నిప్పుల వాగు పుస్తకాన్ని ప్రతి లైబ్రరీలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. భవిష్యత్తులో కూడా వారి కుటుంబాన్ని ఆదుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న తరుణంలో 9 మంది ఉద్యమ కారులు, కవులు, కళాకారులను సన్మానించుకోవడమే కాకుండా వారికి 300 గజాల ఇంటి స్థలాన్ని కూడా కేటాయించాం. వారు ఆత్మగౌరవంతో బతకేలా భారత్ ఫ్యూచర్ సిటీలో వారికి ఇండ్లు కట్టించే కార్యక్రమాన్ని కూడా తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ గారికి సూచిస్తున్నా. అందెశ్రీ పేరిట జానపద విశ్వవిద్యాలయంతో పాటు సభలో వక్తలు చేసిన సూచనలపైన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన నిర్ణయం తీసుకుంటాం.. నాకు అత్యంత ఆప్తుడు. మనసుకు చాలా దగ్గరివాడు. అందెశ్రీ గారి యాదిలో ఈ సంస్మరణ సభ ఏర్పాటు చేసిన వారికి మనస్ఫూర్తిగా అభినందనలు.." అని ముఖ్యమంత్రి గారు అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ గారు, పొన్నం ప్రభాకర్ గారు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు, పలువురు ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అందెశ్రీ గారి సతీమణి మల్లుబాయితో పాటు కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు ఈ సంస్మరణ సభలో పాల్గొని అందెశ్రీ గారికి నివాళు లర్పించారు.

# అప్పులపై తప్పుడు ప్రచారం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి
- వడ్డీలపై కాంగ్రెస్ 'కాకి లెక్కల' డొల్లతనం బట్టబయలు చేసిన అక్టోబర్ నెల కాగ్ నివేదిక
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అప్పులపై తప్పుడు ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, ముఖ్యంగా గత ప్రభుత్వం చేసిన అప్పులపై పదేపదే చెబుతున్న 'కాకి లెక్కల' డొల్లతనం కాగ్ నివేదిక ద్వారా మరోసారి పూర్తిగా బట్టబయలైందని కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాగ్ అక్టోబర్ నెలలో విడుదల చేసిన లెక్కల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు అప్పులు వాటికి కడుతున్న వడ్డీలను తన నివేదికలో చాలా స్పష్టంగా పేర్కొన్నదని తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీ పదేపదే అప్పుల కాకి లెక్కలు అన్ని మరోసారి తేలిపోయాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టడానికే ప్రభుత్వ ఆదాయం, కొత్త అప్పులు సరిపోతున్నాయంటూ కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని కాగ్ తాజా లెక్కలు పూర్తిగా కొట్టిపారేశాయని ధ్వజమెత్తారు.

ప్రతి నెలా రూ.6వేల నుంచి రూ.7వేలకోట్లు వడ్డీల కోసమే చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారని.. కానీ కాగ్ ఇచ్చిన తాజా నివేదిక కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అబద్ధాల పైన మరోసారి చెంప దెబ్బ లాంటి వాస్తవాలను బయటపెట్టింది అని విమర్శించారు. కాగ్ లెక్కల ఏప్రిల్ 2025 నుండి అక్టోబర్ 2025 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన మొత్తం వడ్డీ కేవలం రూ.16,529.88 కోట్లు అని.. అంటే నెలకు సగటున కేవలం రూ.2,361.41 కోట్లు మాత్రమేనన్నారు. కానీ, కాంగ్రెస్ నాయకులు మాత్రం పదేపదే రూ.6వేల నుంచి రూ.7వేలకోట్లు ప్రతినెల వడ్డీలు కడుతున్నామంటూ తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్న దానిలో సగం కూడా వడ్డీలకు వెళ్లడం లేదని.. వడ్డీల పేరుతో అబద్ధాలు చెప్పి, పాలన చేతకానితనాన్ని, తాము చేస్తున్న తప్పులను అవినీతిని అప్పుల మాటున దాచిపెడుతుందని మండిపడ్డారు కేటీఆర్. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అప్పుల మధ్య ఉన్న తేడాను వివరంగా స్పష్టం చేశారు.

గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ప్రతిపైసా ద్వారా ఆస్తులను సృష్టిస్తే.. ఈ ప్రభుత్వం మాత్రం అప్పుల సునామిని సృష్టించి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం వైపు నడిపిస్తుందని మండిపడ్డారు. పార్లమెంట్ లెక్కల ప్రకారం.. పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 2.80 లక్షల కోట్ల అప్పులు తీసుకువస్తే, 23 నెలల కాలంలోనే దాదాపు

మిగితా 4వ పేజీలో

# రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను కఠినతరం చేయండి

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- రవాణా శాఖ ఉన్నత స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో దిశా నిర్దేశం!



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించడం, మరణాల రేటును నివారించడమే లక్ష్యంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కఠినతరం చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులను ఆదేశించారు. రవాణా శాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన కీలక దిశానిర్దేశం చేశారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల పటిష్టత రోడ్డు భద్రత నిబంధనల అమలును వేగవంతం చేసేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన 33 జిల్లా స్థాయి బృందాలు మరియు 3 రాష్ట్ర స్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు నిరంతరంగా, ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా వ్యవసాయ సంబంధిత ట్రాక్టర్లు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. కొత్త ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ఏర్పాటు తర్వాత గత 10 రోజుల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 4,748 కేసులు నమోదు చేయబడ్డాయి. అదే విధంగా 3,420 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణంగా ఉన్న ఓవర్ లోడ్‌పై అధికారులు మరింత దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఓవర్ లోడ్ చేసిన వాహనాలను తప్పనిసరిగా సీజ్ చేయాలి. ఒక వాహనం రెండవ సారి ఓవర్ లోడ్‌తో పట్టుబడితే, ఆ వాహనం పర్మిట్‌ను రద్దు చేయాలి. వాహనం నడుపుతున్న డ్రైవర్ యొక్క డ్రైవింగ్ లైసెన్స్‌ను కూడా రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలి. మైనింగ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ, వాహనాలలో లోడింగ్ జరిగే ప్రదేశాలలోనే ఓవర్ లోడ్‌ను నివారించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

భారీ వాహనాల డ్రైవర్లకు లైసెన్స్ రెన్యూవల్ సమయంలో రోడ్డు భద్రతపై పునశ్చరణ ట్రైనింగ్ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గత సంవత్సరం నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవం మంచి ఫలితాలు ఇచ్చిందని గుర్తు చేస్తూ, జనవరిలో జరిగే రోడ్డు భద్రతా మాసంపై సమగ్ర కార్యాచరణను ఇప్పటినుంచే రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, డ్రైవర్లు, పోలీసులు, ప్రజలందరూ భాగస్వామ్యం అయ్యేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

# ఫార్ములా ఈ రేస్ బేఖారు కేసు..




- కాంగ్రెస్, బీజేపీల టార్గెట్ బీఆర్ఎస్ "కారు"
- పాలన చేతకాక రేవంత్ రెడ్డి డైవర్షన్ పోలిటిక్స్
- ఇది కాంగ్రెస్, బీజేపీల సంయుక్త సమర్పణలో అభూత కల్పిత సీరియల్
- బీఆర్ఎస్ ఫ్యామిలీ అంటేనే ఫైటర్స్, కాంగ్రెస్ అంటేనే చీటర్స్
- మాకు కేసులు కొత్త కాదు, అరెస్టులకు భయపడేది లేదు
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

**బలగం టీవీ, నిజామాబాద్**

ఫార్ములా ఈ రేస్ ఒక బేఖారు కేసు అని, కేటీఆర్ ను ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక అవినీతి అంటూ ఇది కాంగ్రెస్ లేపిన పుకారు అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి మండిపడ్డారు. ఎప్పటికీ కేటీఆర్ కడిగిన ముత్యమని, ఇది కాలం చెప్పే సత్యమని ఆయన స్పష్టం చేశారు.నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ఫార్ములా ఈ రేస్ కేసు పేరుకేనని, అసలు కాంగ్రెస్, బీజేపీల టార్గెట్ బీఆర్ఎస్ "కారు" అని ఆయన అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు సంయుక్తంగా సమర్పిస్తున్న 'ఫార్ములా ఈ రేస్ ' అనే అభూత కల్పిత సీరియల్ ను సృష్టించారని ఆయన చెప్పారు. మొగలిరేకులు, కార్తీకదీపం సీరియల్స్ లాగా సాగదీస్తూ బీఆర్ఎస్ ను దెబ్బకొట్టే కుట్ర చేస్తున్నారని, ఈ కుట్రలో పాత్రధారులు, సూత్రధారులు రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, బండి సంజయ్, సీఎం రమేష్ లని జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేటీఆర్ పై కేసు రేవంత్ రెడ్డి ఫ్రేస్టేషన్ కు నిదర్శనమని, పాలన చేతకాక డైవర్షన్ రాజకీయాలతో రేవంత్ నానా తంటాలు పడుతున్నారని ఆయన అన్నారు. కేటీఆర్ పై కేసుకు

తాజాగా గవర్నర్ అనుమతి పేరుతో రాజకీయ తతంగం చేశారని, ఇది కాంగ్రెస్, బీజేపీల మాయాజాలమని ఆయన పేర్కొంటూ గవర్నర్ ఎన్ని సార్లు అనుమతి ఇస్తారని ఆయన ప్రశ్నించారు. బీసీ లకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం వంటి ప్రజలకు ఉపయోగపడే బిల్లులు ఆమోదించడానికి మనసురాని గవర్నర్లు బీజేపీ పెద్దల ఆదేశాలు పాటిస్తూ రాజకీయ ప్రత్యర్థులను అణచి వేసే కేసులకు మాత్రం ఆగ మేఘాల మీద అనుమతులు ఇస్తున్నారని జీవన్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్ పై కేసు విషయంలో కాంగ్రెస్, బీజేపీ ఫెవికాల్ బంధం మరోమారు బయటపడిందని ఆయన ఆరోపించారు.


రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తప్పుడు కేసు నమోదు చేసిందన్నారు. ఆయనపై అవినీతిపరుడనే ముద్ర వేసి రాజకీయంగా, వ్యక్తిగతంగా అప్రతిష్టపాలు చేయాలనేది ప్రభుత్వ కుట్ర అని జీవన్ రెడ్డి మండిపడ్డారు.ఫార్ములా–ఈ–కారు రేసింగ్ లో కేటీఆర్ పై కేసు రేవంత్ కక్ష సాధింపుకు పరాకాష్ట అని ఆయన మండిపడుతూ ప్రజాపాలన అంటే ప్రజల పక్షాన పోరాడుతున్న వారిపై తప్పుడు కేసు పెట్టడమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ ను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక తప్పుడు కేసులతో వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఫ్యామిలీ అంటేనే ఫైటర్స్, కాంగ్రెస్ అంటేనే చీటర్స్ అని ఆయన అన్నారు.ఉద్యమ నేతలపైనే అణచివేతలా? అరెస్టులకు భయపడేది లేదు.బీఆర్ఎస్ ది 60 లక్షల గులాబీ సైన్యం. ఉద్యమ కాలంలో పెద్ద బాబులనే తరిమికొట్టాం.

ఈ చిన్నబాబులు తమకొక లెక్కా?. రేవంత్ రెడ్డి రాక్షసానందం పొందడానికి కేసీఆర్ ఫ్యామిలీ తో గోక్కున్నావు. నీకూ వైఎస్సార్, చంద్రబాబు, కిరణ్ కుమార్ రెడ్డి లకు పట్టిన గతే పడుతుంది ఆయన హెచ్చరించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి చివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రి గా మిగిలిపోతారని, ఇక భవిష్యత్తులో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రంలో గెలిచే అవకాశమే లేదని జీవన్ రెడ్డి అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని కుతంత్రాలకు పాల్పడినా కేటీఆర్ కడిగిన ముత్యంలా ప్రజాక్షేత్రంలోకి అడుగు పెడతారని ఆయన తెలిపారు. ఇలాంటి ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కాంగ్రెస్ 420 హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటా మని, సర్కార్ దాష్టీకాలను అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణను కాపాడేదాకా పోరాటం చేస్తూనే ఉంటామని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. కేటీఆర్ అంటే రేవంత్ కు కుళ్ళు ఎక్కువయి కండ్లు నెత్తికెక్కి కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నారు. కేటీఆర్ ప్రతిపక్షంలో ప్రతిక్షణం ప్రజల కోసమే పని చేస్తుండటమే రేవంత్ పగకు కారణం. ఒక్క రోజైనా కేటీఆర్ ను జైల్లో పెట్టి మానసికానందం పొందాలని రేవంత్ తాపత్రయ పడుతున్నారు. కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పట్నుంచే ఆయన పై రేవంత్ రకరకాలుగా బద్నామ్ చేసే ప్రయత్నం చేశారు. తాను చేసే పాడు పనులు కే టీ ఆర్ కు ఆపాదించి రేవంత్ రాక్షసానందం పొందారు. ఇపుడు కూడా అదే ధోరణి లో రేవంత్ వెళ్తున్నారు అని ఆయన నిప్పులు చెరిగారు. ఫార్ములా ఈ కార్ల రేసు తో కేటీఆర్ అంతర్జాతీయం గా హైదరాబాద్ కు గుర్తింపు తెచ్చారన్నారు. ఐటీ, మున్సిపల్, ఇండస్ట్రీ మంత్రిగా కేటీఆర్ తెలంగాణ ను అగ్రభాగాన నిలబెట్టారన్నారు. తెలంగాణ తలసరి ఆదాయం పెరగడానికి, దేశ జీడీపీ లో తెలంగాణ వాటా పెరగడానికి కేటీఆర్ యే కారణమన్నారు. కేటీఆర్ జీడీపీ పెంచితే రేవంత్ గుండాం ఖజం పెంచారని జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేటీఆర్ తలసరి ఆదాయం పెంచితే రేవంత్ తన సొంత ఆదాయం పెంచుకున్నారన్నారు. ఫార్ములా వన్ లో కేటీఆర్ జైలుకు పోతే ఎందరో సీఎం లు జైలు కు పోవాల్సి ఉంటుందని ఆయ న వ్యాఖ్యానించారు. కేటీఆర్ తెలంగాణ లో చేసింది ఎంతో మంది సీఎం లు తమ రాష్ట్రాల్లో చేశారని ఆయన గుర్తు చేశారు. ఫార్ములా వన్ తో కేటీఆర్ పెట్టుబడులు తెస్తే రేవంత్ రెడ్డి అందాల పోటీలతో రాష్టం పరువును అంగట్లో పెట్టి అమ్మారని, లోకేష్ ఏపీ కి ఇపుడు గూగుల్ తెస్తే కేటీఆర్ హైదరాబాద్ కు ఎపుడో తెచ్చారని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, సీనియర్ నాయకులు ప్రభాకర్, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్ ఠాకూర్, దండు శేఖర్, పోల సుధాకర్, మెట్టు సంతోష్, అభిలాష్, సురేష్, రమేష్, సయ్యద్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడుకుంటూ కుప్పకూలిన బాలుడు.. గుండెపోటుతో మృతి

- రంగారెడ్డి జిల్లాలో ఘటన



**బలగం టీవీ, రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్‌లో విషాదం చోటు చేసుకుంది. ఆడుకుంటూ స్పృహ తప్పి పడిపోయిన అభయ్ అనే బాలుడు గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. బాబుల్ రెడ్డి నగర్‌కు చెందిన బాలుడు అభయ్ తన స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అభయ్ అకస్మాత్తుగా పడిపోవడం చూసిన స్థానికులు వెంటనే అప్రమత్తమై, అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అభయ్‌ను పరీక్షించిన వైద్యులు.. అప్పటికే గుండెపోటు కారణంగా బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్న వయస్సులోనే గుండెపోటుతో అభయ్ మరణించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.



## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి..

**బలగం టీవీ, సిద్దిపేట**

తెలంగాణ మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు సిద్దిపేట జిల్లా, చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పర్శరాములు తండ్రి ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఓదార్చారు. పెద్ద కోడూరు గ్రామానికి చెందిన విద్యార్థి విభాగం అధ్యక్షులు రంజిత్ రెడ్డి కుటుంబాన్ని కూడా మంత్రి హరీష్ రావు పరామర్శించారు. గంగాపూర్ గ్రామానికి చెందిన ఫోటో జర్నలిస్ట్ ఎర్ర నర్సయ్య భార్య, %ూఅఎ% ఎర్ర సునీత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటానని భరోసానిచ్చారు. రామంచ గ్రామానికి చెందిన సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షులు దాసరి రమేష్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారికి ఆర్థిక సహాయాన్ని కూడా అందించారు. కమ్మర్ల పల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ శ్రీనివాస్ రెడ్డి ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని కూడా హరీష్ రావు పరామర్శించారు. కష్టకాలంలో అండగా నిలవడం పట్ల బాధిత కుటుంబాలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను పరామర్శించిన నాఫ్స్కాబ్ చైర్మన్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ ని పరామర్శించిన నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు నేడు పరామర్శించారు. ఇటీవల గుండె సంబంధిత సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొంది, కోలుకుని ఇంటికి వచ్చిన చైర్మన్ ని ఆయన కలిసి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, నాగుల సత్యనారాయణ గౌడ్ చికిత్స అనంతరం ప్రస్తుతం తాను బాగానే ఉన్నానని, వైద్యుల సలహాల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు జిల్లా గ్రంథాలయ చైర్మన్ కి ధైర్యం చెప్పి, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## బీసీల 'న్యాయ సాధన దీక్ష.. రిజర్వేషన్ల కోసం పోరాటం..

**బలగం టీవీ, చందుర్తి :**



బీసీ సమాజానికి దక్కాల్సిన రాజ్యాంగ హక్కుల సాధన కోసం రాజన్న సిరిసిల్లా జిల్లా, చందుర్తి మండల కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఒక రోజు న్యాయ సాధన దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో బీసీల విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో న్యాయమైన వాటా తక్షణం కల్పించాలని ప్రభుత్వాలను బలంగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్లా జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు మాట్లాడుతూ.. బీసీలకు దక్కాల్సిన న్యాయం ఇప్పటికీ అర్ధాంతరంగా ఉందని, తమ వాటా యాచిక కాదని, అది రాజ్యాంగ హక్కు అని స్పష్టం చేశారు. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి శాశ్వత రక్షణ కల్పించాలని, చట్టసభల్లో బీసీ లకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలని, విద్య, ఉపాధి, రాజకీయాల్లో జనాభాకు తగ్గట్టు తమ న్యాయమైన వాటాను తక్షణం కల్పించాలని డిమాండ్ చేశారు.దేశ నిర్మాణంలో బీసీలు పెద్ద వంతు ఉన్నా, అవకాశాల్లో మాత్రం చిన్న వంతు దక్కడం అన్యాయమని, ఈ పరిస్థితి మారాలని అన్నారు. బీసీ సమాజం న్యాయం కోసం మా పోరాటం కొనసాగుతుంది%ొ% రాజ్యాంగ హక్కులు అమలు అయ్యే వరకు వెనక్కి తగ్గేది లేదని గట్టిగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యకులు అమరబండ ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్, ప్రధాన కార్యదర్శులు వనపర్తి సతీష్, బొరిగే ప్రసాద్, ముఖ్య సలహాదారులు తిప్పని నరసయ్య, హనుమయ్య చారి గారులతో పాటు శ్రీనివాస్ మీసేవ, తిప్పని శ్రీనివాస్, రుద్రంగి మండల అధ్యక్షులు మల్లేష్ పటేల్, అలాగే అన్ని గ్రామ అధ్యకులు చర్లపల్లి మహేష్, అందాస్ రమేష్, ఊగిలే శ్రీనివాస్, వేణు, నాగరాజు, చిరంజీవి, ఎగోళం శ్రీనివాస్, మెంగని శ్రీనివాస్, గుండోజి శ్రీనివాస్, బసోజు మణి, చెక్కపెలి గణేష్, అన్నూరి వంశీ, నాగేశం పాల్గొన్నారు. అలాగే, ఎల్లారెడ్డిపేట మండల మహిళా అధ్యక్షురాలు బాద పోచవ్వ, పండుగ గంగ, బోయినపల్లి మండల మహిళా అధ్యక్షురాలు పులి రేణుక సహా అన్ని గ్రామాల బీసీ సభ్యులు, యువకులు ఈ దీక్షలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు.



## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి..

- విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బోయినపల్లి కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ

**బలగం టీవీ, బోయినపల్లి**

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను ఇంచార్జి కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టోర్ రూమ్ లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు పరిశీలించారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులు పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని వివరించారు.

ఈ సందర్భంగా విద్యాలయంలో 6వ, 9 వ తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులందరూ చదువుపై శ్రద్ధపెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యాలయం ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**పీ హెచ్ సీ తనిఖీ**

బోయినపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు, ఓపీ, మందుల రిజిస్టర్, వ్యాక్సిన్ గది, మందులు ఇచ్చే గదిని పరిశీలించారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై రోగుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గర్భిణీలు అందరూ ప్రభుత్వ దవాఖానల్లో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని, ఇక్కడ అందుతున్న సేవలు, వసతులపై క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని, నిరంతరం పరీక్షలు చేసి వైద్యం అందించాలని సూచించారు. సర్కార్ దవాఖానల్లోనే ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.



## ఎస్సీ వర్గీకరణపై డీజీపీకి మాల సంఘాల జేఏసీ ఫిర్యాదు

- తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఎఫ్.ఎస్.ఎల్. నోటిఫికేషన్‌లో మాల 25 కులాలకి జరిగిన నష్టంపై డీజీపీకి వినతి.

**బలగం టీవీ, హైదరాబాద్:**

తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఫారెస్ట్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్.ఎస్.ఎల్.) నోటిఫికేషన్‌లో మాల 25 కులాలకి జరిగిన అన్యాయంపై తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నాయకులు శుక్రవారం రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి ని కలిశారు. తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ మాందాల భాస్కర్ ఆధ్వర్యంలో, గౌరవ ఛైర్మన్ చెరుకు రామచందర్, గ్రేట్ హైదరాబాద్ ఛైర్మన్ బేరా బాలకిషన్, మాల స్టూడెంట్ జేఏసీ ఛైర్మన్ మాదాసు రాహుల్ రావు లు డీజీపీకి వినతిపత్రాన్ని సమర్పించారు.

రాష్ట్రంలో గత ఆరు నెలలుగా విడుదలైన నోటిఫికేషన్లలో, ముఖ్యంగా టీఎస్‌పీఆర్‌బీ ఫారెస్ట్ సైన్స్ ల్యాబ్ నోటిఫికేషన్‌లో, ఎస్సీ వర్గీకరణ కారణంగా మాల 25 కులాల వారికి రిజర్వేషన్లలో తీవ్ర అన్యాయం జరిగిందని జేఏసీ నాయకులు డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయంగా లేకపోవడం మరియు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించకపోవడం వలనే మాల సామాజిక వర్గం రిజర్వేషన్లు కోల్పోవాల్సి వస్తుందని వారు వివరించారు. తమకు జరుగుతున్న నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయడం కోసమే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేశామని నాయకులు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తక్షణమే సవరించాలని, 20 లోపు రెండు రోస్టర్ పాయింట్స్ కేటాయించాలని, రెండు శాతం రిజర్వేషన్ పెంచిన తర్వాతనే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు వేయాలని, తెలంగాణ పోలీస్ శాఖలో అంతవరకు నోటిఫికేషన్లను నిలిపివేయాలని జేఏసీ డిమాండ్లు తెలియజేశారు. మాల సంఘాల జేఏసీ నాయకుల వినతిపై డీజీపీ బి. శివధర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు.

## అర్హులైన ప్రతి మహిళకూ ఇందిరా మహిళా శక్తి చీరలు

- మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలి
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బోయినపల్లిలో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



**బలగం టీవీ, బోయినపల్లి:**

అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. బోయినపల్లి రైతు వేదికలో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ లు మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజు నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు వారి పేరిట ఇస్తున్నామని వివరించారు. జిల్లాలోని సిరిసిల్లలో ఇందిరా మహిళాశక్తి చీరలు తయారై రాష్ట్ర మంతా పంపిణీ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. 32 జిల్లాల నుంచి ఎస్ హెచ్ జీ ల బాధ్యులు వచ్చి చీరల తయారీ విధానం, దశలు, రంగులు, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మత్తుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. స్కూల్ యూనిఫాం వారితో కుట్టించామని పేర్కొన్నారు.

సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని వెల్లడించారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతోపాటు ఇప్పుడు ఎస్ హెచ్ జీ సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు.

200 యూనిట్ ల ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, నూతన రేషన్ కార్డులు ఇస్తున్నామని, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఎక్కడైతే మహిళలు సంతోషంగా ఉంటాం ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎల్లేష్ యాదవ్, వైస్ ఛైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు సురేందర్ రెడ్డి, దుర్గారెడ్డి, డీఆర్డీఓ శేషాద్రి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీఓ జయశీల, ఏపీఎం, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత..




- సిరిసిల్ల కార్మికులకు ఉపాధి.. మహిళలకు ఆత్మ గౌరవం
- అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తాం..
- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఇల్లంతకుంటలో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి పథకంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఉపాధి దొరుకుతుందని, మహిళల ఆత్మ గౌరవానికి తోడ్పడుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇల్లంతకుంట రైతు వేదికలో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ లు మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ప్రతి ప్రభుత్వ పథకం అమలులో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎస్ హెచ్ జీ ల నుంచి రుణాలు మంజూరు చేస్తుందని వెల్లడించారు. మహిళల ఆర్థిక ప్రగతికి కోట్లాది రూపాయల లోన్లు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. జిల్లాలోని సిరిసిల్లలో ఇందిరా మహిళాశక్తి చీరలు తయారై రాష్ట్రమంతా పంపిణీ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. 32 జిల్లాల నుంచి ఎస్ హెచ్ జీ ల బాధ్యులు వచ్చి చీరల తయారీ విధానం, దశలు, రంగులు, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మత్తుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు.

ఎస్ హెచ్ జీ ల్లో ప్రస్తుతం 18- 59 ఏండ్ల వారికి అవకాశం ఉందని, ప్రభుత్వం ఇప్పుడు 15-18 ఏండ్ల కిశోర బాలికలకు, 60 ఏండ్ల వయసు పైబడిన వారికి కూడా సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం కల్పించిందని తెలిపారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని, రూ. రెండు లక్షల వరకు రుణ బీమా, రూ. 10 లక్షల చొప్పున ప్రమాద బీమా మంజూరు చేసిందని వెల్లడించారు. జిల్లాలో కొత్తగా 5560 మంది ఎస్ హెచ్ జీల్లో చేరారని తెలిపారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతోపాటు ఇప్పుడు ఎస్ హెచ్ జీ సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చైతన్య, వైస్ ఛైర్మన్ ప్రసాద్, డీఆర్డీఓ శేషాద్రి, మండల ప్రత్యేక అధికారి, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ ఫరూక్, ఎంపీడీఓ శశికళ, ఏపీఎం, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రజారోగ్య సేవలు మెరుగుపరచండి..

- జిల్లా వైద్యాధికారి డా. రజిత

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజారోగ్య కేంద్రాలను శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ ను మరియు తంగళ్ళపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడి సేవలను పరిశీలించారు. డా. రజిత తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లో నిర్వహించే రక్త నమూనా పరీక్షల విధానాన్ని, మరియు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షా ఫలితాలు ఖచ్చితంగా మరియు వేగంగా ప్రజలకు అందజేయాలని, దీని ద్వారా ప్రజల వ్యాధులను సకాలంలో గుర్తించి అరికట్టడంలో జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలని అక్కడి వైద్య సిబ్బందికి సూచన చేశారు.అనంతరం, తంగళ్ళపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డా. రజిత, అక్కడ నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్లను పరిశీలించారు. చిన్నపిల్లలకు టీకాలు వేసే కార్యక్రమంపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. చిన్నపిల్లల తల్లిదండ్రులకు వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, పిల్లలకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా వారిలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించాలని ఆమె సూచించారు. మండల వైద్యాధికారి డాక్టర్ స్నేహ కి మరియు ఇతర వైద్య సిబ్బందికి ఆమె స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.




# మళ్లీ ప్రేక్షకుల ముందుకు 'అమృతం'

- **నవంబర్ 24 నుంచి ప్రతిరోజూ రెండు ఎపిసోడ్‌లు**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు టీవీ చరిత్రలో చిరస్మరణీయమైన హాస్య సిట్‌కామ్ 'అమృతం' మళ్లీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. తాజాగా ఈ ప్రఖ్యాత ధారావాహిక ప్రసారం అవుతూ 24 ఏళ్లు పూర్తైన సందర్భంగా, నిర్వాహకులు 'అమృతం'ను రీమాస్టర్డ్ వెర్షన్‌గా యూట్యూబ్‌లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

నవంబర్ 24 నుంచి ప్రతిరోజూ రెండు ఎపిసోడ్‌లు అధికారిక యూట్యూబ్ ఛానల్ Amrutham పేరుతో విడుదల కానున్నాయి. దీంతో ఈ క్లాసిక్ కామెడీ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

2001 నవంబర్ 18న జెమిని టీవీలో ప్రారంభమైన ఈ సిట్‌కామ్, 2007 నవంబర్ 18 వరకు ఆరు సంవత్సరాలపాటు 313 ఎపిసోడ్‌లతో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. ప్రముఖ నిర్మాత%–%రచయిత గుణ్ణం గంగరాజు సృష్టించి నిర్మించిన ఈ ధారావాహికలో: హాస్యం, వినోదంతో ప్రతి ఇంట్లోనూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న 'అమృతం' ఇప్పుడు యూట్యూబ్ ద్వారా కొత్త తరం ప్రేక్షకులను ఆకట్టుకోడానికి సిద్ధమవుతోంది.

# సౌతాఫ్రికా శుభారంభం

- **చివరి సెషన్‌లో పుంజుకున్న భారత్**
- **రెండో టెస్ట్ తొలి రోజు ఆఫ్రికా 247/6**
- **కుల్దీప్ యాదవ్ 3 వికెట్లు..**

**బలగం టీవీ, హైదరాబాద్**






భారత్‌తో జరుగుతున్న రెండో టెస్ట్ తొలి రోజు సౌతాఫ్రికా మెరుగైన ఆరంభం అందుకుంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై ఓపెనర్లు మార్క్‌రమ్, రికెల్టన్?గా ఆడి పటిష్టమైన భాగస్వామ్యానికి నాంది పలికారు. రోజంతా సాగిన ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు 81.5 ఓవర్లలో 6 వికెట్లకు 247 పరుగులు చేసింది.

ట్రిస్టన్ స్టబ్స్ (49), టెంబా బవుమా (41) హాఫ్ సెంచరీలు తృటిలో చేజార్చుకోగా, ఓపెనర్లు మార్క్‌రమ్ (38), రికెల్టన్ (35) విలువైన పరుగులు అందించారు. తొలి రెండు సెషన్లలో పూర్తిగా ఆధిపత్యం చెలాయించిన సౌతాఫ్రికా%ా% మూడో సెషన్‌లో మాత్రం భారత బౌలర్లకు తలొగ్గింది.

**కుల్దీప్ యాదవ్ గేమ్ ఛేంజర్**

చివరి సెషన్‌లో కుల్దీప్ యాదవ్ (3/48) ధాటికి సౌతాఫ్రికా బ్యాటింగ్ నడక ఆగింది. బుమ్రా, సిరాజ్, జడేజా చెరో వికెట్ తీసి సౌతాఫ్రికా రన్‌చిత్రంపై నియంత్రణ సాధించారు. వెలుతురు తగ్గడంతో మరో 8.1 ఓవర్ల ముందే ఆట నిలిపివేశారు.

రెండో రోజు ఆరంభం నుంచే సౌతాఫ్రికా చివరి వికెట్లను క్లీన్ చేస్తేనే భారత్ భారీ స్కోర్‌కు పునాది వేయగలదు. లేనిచో తొలి టెస్ట్ ఫలితమే పునరావృతం కావాల్సి వస్తుందని క్రికెట్ పండితులు విశ్లేషిస్తున్నారు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు మంచి లాభాలనే అందించారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లలోనే మార్క్‌రమ్ ఇచ్చిన స్లిప్ క్యాచ్‌ను కెఎల్ రాహుల్ వదిలేయడం భారత్‌కు పెద్ద నష్టం అయ్యింది. అంతేకాక మరో రెండు రనౌట్ అవకాశాలను కూడా టీమిండియా చేజార్చుకుంది. టీ బ్రేక్ ముందు బుమ్రా బౌలింగ్‌కు మార్క్‌రమ్ బోల్డ్ అవ్వడంతో తొలి బ్రేక్‌కు ఆఫ్రికా 82/1తో వెళ్లింది.

రెండో సెషన్‌లో కుల్దీప్ యాదవ్ రికెల్టన్‌ను పెవిలియన్ పంపినా%ా% స్టబ్స్–బవుమా జోడీ భారత బౌలర్లపై ఒత్తిడి పెంచింది. వీరు జాగ్రత్తగా ఆడి లంచ్ సమయానికి జట్టును 156/2 వరకు చేర్చారు.

తరువాతి సెషన్‌లో జడేజా బవుమాను అవుట్ చేయగా, కుల్దీప్ యాదవ్ వరుస విజయాలతో స్టబ్స్, మల్డర్‌ను ఔట్ చేసి ఆఫ్రికా పగ్గాలు లాగాడు. సిరాజ్ కొత్త బంతితో జోర్జీ వికెట్ తీసిన వెంటనే బ్యాడ్ లైట్ కారణంగా ఆట నిలిపివేశారు.

# రాష్ట్ర డీజీపీ ఎదుట 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

సాంబయ్య ములుగు జిల్లాకు చెందినవారు కాగా అప్పాసీ నారాయణ పెద్దపల్లి జిల్లా రామగుండం కు చెందినవాడని చెప్పారు. దాదాపు 32 ఏండ్లుగా వీరు అజ్ఞాత ఉద్యమంలో ఉన్నారని అన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ముగ్గురు ఒక్కొక్కరిపై రూ.20 లక్షల రివార్డు ఉన్నదనీ, మిగతావారికి సంబంధించి ఆయా రాష్ట్రాల్లో పేర్కొన్న రివార్డులు ఉన్నాయని తెలిపారు. వీరికి ఈ రివార్డులను వెంటనే అందజేయటం జరుగుతున్నదని ఆయన చెప్పారు.

మావోయిస్టు మాజీ ప్రధాన కార్యదర్శి గణపతి ఎలియాస్ ముప్పాల లక్ష్మణ్‌రావు, మరో అగ్రనాయకుడు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవోజీల లొంగుబాటుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. ప్రస్తుతం మావోయిస్టు కేంద్ర కమిటీలో రాష్ట్రానికి చెందిన ఐదుగురు గణపతి, దేవోజీ, రాజిరెడ్డి, నరహరి, హనుమంతులు కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్నారనీ, మరో పది మంది రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిపి మొత్తం 59 మంది తెలంగాణ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు ఉన్నారని డీజీపీ వివరించారు. తెలంగాణలో లొంగిపోవడానికి హిడ్మా ప్రయత్నించగా.. ఆయనకు అవకాశం ఇవ్వలేదని వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఆయన మరో ప్రశ్నకు జవాబిచ్చారు.

ప్రస్తుతం లొంగిపోయినవారిలో అనారోగ్య సమస్యలు, సిద్ధాంత విభేదాలతో పాటు, పోలీసు బలగాల ఒత్తిడి కారణంగా బయటకు వచ్చారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. లొంగిపోయిన మహిళా మావోయిస్టులకు వారి భవిష్యత్తులో నిలదొక్కుకోవడానికి అవసరమైన విద్యను అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. గత 11 నెలల్లో 463 మంది మావోయిస్టులు లొంగిపోయారనీ, అందులో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులతో పాటు పలువురు ఇతర క్యాడర్‌కు చెందిన సభ్యులు ఉన్నారని చెప్పారు. దేవోజీని మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా తాము గుర్తించటం లేదనీ, ఆ విధమైన సమాచారమూ తమ వద్ద లేదనీ, ప్రస్తుతం లొంగిపోయినవారు కూడా ఆయనను గుర్తించటం లేదని మరో ప్రశ్నకు డీజీపీ జవాబిచ్చారు. మారుతున్న కాల పరిస్థితుల్లో ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ప్రభుత్వానికి లొంగిపోయి నూతన జీవితాన్ని ప్రారంభించటం మినహా మరో గత్యంతరం లేదని ఆయన స్పష్టం చేశారు. లొంగిపోయినవారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందని వివరించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులపై ఉన్న నగదు రివార్డుతో పాటు మిగతావారికి రూ.25వేల పారితోషకాన్ని డీజీపీ అందజేశారు. ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు తమ వద్దకు ఐదారు రోజుల ముందే వచ్చారని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐబీ ఐజీ సుమతి, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుతం దేశంలో వస్తున్న కాలానుగుణ మార్పులను బట్టి తాము లొంగిపోయినట్టు మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు సాంబయ్య, నీలేశ్‌లు అన్నారు. తాము పార్టీకి చెప్పి లొంగుబాటులో నడిచామని తెలిపారు. ఉద్యమంలో అనేక కష్ట, నష్టాలను ఎదుర్కొన్నామనీ, కానీ అనుకున్న మార్పులేవీ కనిపించకపోవటంతో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవటమే మేలు అని భావించామని వారు చెప్పారు. సిద్ధాంతపరంగా విభేదాలేవీ లేకపోయినప్పటికీ ఆయుధాలతో పోరాటం చేయటం సాధ్యంకాని పరిస్థితి ప్రస్తుతం నెలకొన్నదనీ, అజ్ఞాతంలో ఉన్న మిగతావారు కూడా లొంగిపోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# అప్పులపై తప్పుడు ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

రెండు లక్షల 30 వేల కోట్ల అప్పులను కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిందని మండిపడ్డారు. ఆనాడు మిషన్ భగీరథ కాళేశ్వరం పాలమూరు రంగారెడ్డి మిషన్ కాకతీయ వేలకోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణం వంటి అనేక ఉత్పాదక ఆస్తులను సృష్టించిందని, కానీ ఈ ప్రభుత్వం ఎలాంటి కొత్త పథకం లేకుండానే, ఒక్క ప్రాజెక్టు ప్రారంభం కూడా చేయకుండానే, కనీసం మౌలిక వసతుల కోసం ఒక్క ఇటుక పేర్చకుండానే రెండు లక్షల 30 వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకువచ్చి ఏం చేసిందని ప్రశ్నించారు.

కాగ్ నివేదికతో వడ్డీల వాదనలో డొల్లతనం బయటపడటంతో, ఇంత భారీ మొత్తంలో చేస్తున్న అప్పులన్ని ఎవరి జేబుల్లోకి పోతున్నాయో ప్రజలుకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. వడ్డీల పేరుతో పదేపదే అబద్ధాలు చెబుతూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం, వాస్తవానికి ఈ అప్పులన్నింటినీ తమ అనుచరులు, మధ్యవర్తులు మరియు ఢిల్లీకి మూటలను పంపడానికే ఉపయోగిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని 'స్కామ్‌గ్రెస్ ఏటీఎం'గా మార్చారు. ఇన్ని రోజులు వడ్డీల కోసమే అప్పులు చేస్తున్నామని కాంగ్రెస్ వాళ్లు చెప్పుకొచ్చినా, కాగ్ నివేదికతో మరోసారి వాదనలోని డొల్లతనం బట్టబయలైనందున, ఈ అప్పులన్నీ దేని కోసం చేశారో వెంటనే ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ కొన్ని ముఖ్యమైన డిమాండ్లు చేశారు. వడ్డీల లెక్కలపై పదేపదే అబద్ధాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. గత 23 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి తెచ్చిన రూ. 2.23 లక్షల కోట్ల అప్పులు ఏ ఏ పథకాలకు, ఏ ఏ ప్రాజెక్టుల కోసం ఖర్చు చేశారో వెంటనే వివరాలు విడుదల చేయాల్సిందేనన్నారు. అదే విధంగా, గత 7 నెలలుగా వివిధ కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పుల వివరాలను కూడా తక్షణమే ప్రజల ముందు ఉంచాలన్నారు. వీటితోపాటు ఈ అంశంలో ప్రజలను ముఖ్యంగా శాసనసభను తప్పుదోవ పట్టించినందుకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని మరోసారి డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అప్పుల పేరు చెప్పి ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను, 420 హామీలను అమలు చేయకుండా తప్పించుకుంటే కుదరదని, కాంగ్రెస్ పార్టీ చెబుతున్న అప్పుల కాకి లెక్కలు ప్రజలు నమ్మరని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తమ సొంత జేబులు నింపుకోవడం పక్కన పెట్టి తీసుకు వస్తున్న అప్పులతో ప్రజలకు సంక్షేమ పథకాలను రాష్ట్ర భవిష్యత్తు కోసం మౌలిక వసతుల నిర్మాణ ప్రాజెక్టులను చేపట్టాలని డిమాండ్ చేశారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మధ్యప్రదేశ్ సీఎం

**బలగం టీవీ, హైదరాబాద్**



ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రేవంత్‌రెడ్డి వివరించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక కార్యక్రమాల గురించి చెప్పారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

- **మార్కెట్ యార్డులో ఆధునిక వసతులు**
- **రూ.55 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
- **చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**బలగం టీవీ, బోయినిపల్లి**



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కవర్ షెడ్ల నిర్మాణం రైతు ఎద్దుల బండి విగ్రహాల నిర్మాణం కోసం శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే మెడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. రైతు సంక్షేమ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, రైతులకు ఆధునిక వసతులతో మార్కెట్ యార్డులో పనులు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర, సన్న బియ్యానికి బోనస్, రైతుబంధు పథకాలు అమలు చేస్తూ, రైతులను రాజులను చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయినీ ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి ,పిఎసిఎస్ చైర్మన్లు సురేందర్ రెడ్డి, దుర్గారెడ్డి, తహశీల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీవో జయశీల, ఏఓ ప్రణీత, ఎంపీఓ శ్రీధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాబు, రమేష్, సతీష్, శేఖర్ రెడ్డి, వెంకటేష్, అజయ్, ప్రదీప్, మహేష్, నాయకులు కౌడగాని వెంకటేష్, సంభ లక్ష్మి రాజం, ఏనుగుల కనకయ్య, నాగుల వంశీ, ఏమి రెడ్డి సురేందర్ రెడ్డి, జోగు రవీందర్, జంగం అంజయ్య, రామిడి శ్రీనివాస్, ఉయ్యాల శ్రీనివాస్, కొమ్మనబోయిన సువిన్ యాదవ్, జంగ సత్యం, నల్ల మోహన్, బోయిని పరుశురాం, బొజ్జ మహేందర్, పొత్తూరి మహేందర్, మెరుపుల జలంధర్, బోయిని లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.